"కథలు కన్న అమెరికా జీవితాలు"
- నిర్మలాదిత్య (భాస్కర్ పులికల్)

గతంలో జరిగిన సాహితీ సభలో "డయాస్పోరా కథల - పరిణామాలు" అన్న అంశం పైన మాట్లాడం జరిగింది . 1995 లో పెమ్మరాజు వేణు గోపాల రావు గారు, అమెరికా తెలుగు కథల తొలి సంకలనం లో, ప్రతిపాదించిన విధంగా ఆంతరిక సమస్యలు , మరపురాని మన దేశం, కొత్త అనుభవాలు, కేవలం కల్పితం అని, కథలను నాలుగు తరగతుల లాగా చూడ గలిగితే, కాల క్రమేణా 1995-2012 వరకు వచ్చిన కథల వల్ల, ఆ నాలుగు తరగతుల నిష్పత్తిలో ని మార్పులను విశ్లేషించాను. ఇది సంఖ్యా పరమైన విశ్లేషణ మాత్రమే.

ఆ విశ్లేషణ ద్వారా తెలిసిన విషయాలు - తొలితరం కథలలో మూడోవంతు కథలు మరపురాని మన దేశం పైన ఉంటే, ఇప్పటికి ఆ విభాగానికి అదే నిష్పత్తి ఉండడం. కాదంటే మొదట్లో మన దేశం పై కథలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు ఆ స్థానం కొత్త ఆనుభవాల మీద రాసిన కథలు దక్కించుకున్నాయి. మరో విషయం, అమెరికా డయాస్పోరా కథలు రాస్తున్న చాలా మంది రచయితలు, రచయిత్రులు యాభై ఏళ్ళు దాటిన వాళ్ళే. ఇరవై, ముప్పై లో ఉండి కథలు రాస్తున్న వారు 10% కూడా లేదని అంచన. ఇక ఇక్కడే పుట్టి పెరిగిన రెండవ తరం తెలుగు వారి నుంచి, వచ్చిన తెలుగు కథలు అరుదే . .
రచయితలూ కథల ద్వారా ఓ కాల్పనిక ప్రపంచం సృష్టించగలిగినా , అందులో నిజ జీవితాలను కప్పి పుచ్చడం దాదాపు అసాధ్యమే. ఆ విధంగా, అమెరికా నుంచి, అమెరికా నేపథ్యంగా రాసిన కథలు అమెరికా జీవితాలకి దర్పణాలే. ప్రస్తుత ప్రయత్నం. అమెరికా కథలలో ఎలాంటి పాత్రలు, జీవితాంశాలు చోటు చేసుకుంటున్నాయి? ఇక్కడ జీవిస్తున్న వారి సమస్లు ఏమిటీ? వారి పరిష్కారం కథలలో వస్తున్నాయా?. అలానే ఏ విషయాలను మన తెలుగు కథానికలు ఎక్కువగా మక్కువ చూపెట్టడము లేదు. మంచి సాహిత్యం రావడానికి కొత్త కథా వస్తువులు ఉన్నాయా ? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెదకడమే. ఈ ప్రయాణంలో నాకు తోచిన అభిప్రాయలు కొన్ని మీతో పంచుకోవడానికి ప్రయత్నిస్తాను.

ఇక ఈ విశ్లేషణ కొరకు, భారత దేశం నేపథ్యంగా రాసిన కథలు, ఇతర కథలు (అన్ని దేశాలకు వర్తించే హాస్య, సైన్స్ ఫిక్షన్ లాంటి కథలు) వదిలేసి, అమెరికా నేపథ్యం గా వ్రాసిన కథలనే ఎన్నుకున్నాను. ఇటీవల ప్రచురింపబడిన డియాస్పోరా కథలలో 50% దాకా అమెరికా దేశం నేపథ్యంలోనే ఉండడం సంతోషము, కానీ ఈ తరగతి కథలలో కూడా చాలా కథలు ఓ కాలు భారత దేశంలో పెట్టి రాసిన కథలే. అమెరికా దేశ వాస్తవ్యులుగా, ఇక్కడ నివసిస్తున్న వారి జీవితాలు మీద రాసిన కథలు మొత్తం డియాస్పోరా కథలతో పోలిస్తే 20% కూడా ఉండవు. ఇది ఒక లోటే

అమెరికా నేపథ్యంగా వ్రాసిన (అమెరికా) కథలలో పాత్రలు చాలా మటుకు మధ్య వయస్కులు , పెద్ద వారు తరచూ తటస్థ పడుతుంటారు. విద్యార్థులు, ఉద్యోగం కోసం వెదుకుతున్న యువతి యువకులు తక్కువే. కాబట్టి కథా వస్తువు కూడా ఈ పాత్రలకు సంబంధించిన జీవితాల గురించే ఉండడం లో ఆశ్చర్యం ఏమి లేదు.

ఈ అమెరికా కథలలో కొన్ని ఇతివృత్తాలు మళ్లీ , మళ్లీపునరావృత్తం అవ్వు తుంటాయి. భారత దేశ జీవన శైలికి అమెరికా జీవితాలకు ఉన్న తారతమ్యాలను ఆధారంగా చేసుకొని వ్రాసిన కథల పాలు అమెరికా కథలలో ఎక్కువే. ఏ దేశం సంస్కృతి గొప్పది? ఈ కొత్తగా వలస వచ్చిన దేశం విలువలను సరిగా అర్థం చేసుకున్నామా? అన్న మీమాంసలకు జవాబు వెదికే కథలు, అమెరికాలో చూస్తున్న విషయాలు ఏ విధంగా అపార్థం చేసుకున్నామో, ఏ విధంగా ఇక్కడి సంస్కృతీ, విలువలు సరి అయినవో అన్న సమాధానంతో ముగింపు అయ్యే కథలు వీటికి ఉదాహరణ. . విశ్లేషణాత్మక దృష్టి తో చదివినప్పుడు, అన్నీ కథలు ఓ ఫీల్ గుడ్ ముగింపుతో రాస్తే, నిజ జీవితం పూర్తిగా చూపెట్టడానికి చాలా అవకాశాలు కథకులు ఉపయోగించుకోలేదేమో అన్న అనుమానం రాక పోదు.

ముసలితనం, వంటరితనం మీద కూడా అమెరికా కథలు చాలా వచ్చాయి. ఉద్యోగ, జీవన పోరాటంలో మునిగిన పిల్లలు, పెద్దలను పట్టించుకోకపోవడం, ఏదైనా చేయాలి కానీ మాట్లాడడానికి ఓ మనిషి కూడా లేడే అన్న బాధ, స్వచ్ఛంద సేవల ద్వారా జీవిత పరమార్థం వెదుక్కోవడం లాంటి అంశాలు ఈ కథలకి వస్తువు. హృదయానికి హత్తుకొనే కథలు కూడా ఈ గుంపులోని కథలలోనే తటస్థపడుతుంటాయి.

భారత దేశం , అక్కడి తన వారిని వదిలేసి ఇక్కడ ఓ ఈతి బాధ లేని ఓ మంచి జీవితం గడపగలుతున్నాం అన్న గిల్టీ మనస్తత్వం ఆధారంగా వ్రాసిన కథలు కూడా ఎక్కువే. కాదంటే ఈ కథలలో , ఈ దేశం వచ్చి ఏమి కొల్పోయామో , అందువల్ల సంతోషం , గిల్టీ భావనల బదులు బాధ, పశ్చ్యాతాపం తో వ్రాసిన కథలు కూడా తారస పడుతుంటాయి. ఈ తరగతిలో బొమ్మ బొరుసు రెండు ప్రక్కల చూడగలగడం మిగిలిన కథా తరగతులకంటే బిన్నమైన మంచి పరిణామం.

ఇక చివరి తరగతి నోస్టాల్జియా కథలకి చెందుతుంది . చాలా రోజుల తరువాత భారత దేశం చూడ గలగడమో, బంధు మిత్రులను అమెరికాలో కలుసుకోవడం అన్న అంశం కథా వస్తువుగా తీసుకున్నవి. రెండు దేశాల మధ్య రాక పోకలు, అవగాహన ఎక్కవవుతున్నందు వల్ల , ఈ కోవా కథలు పోగపోగా తక్కువగానే వస్తాయని అనుకోవచ్చు.

ఈ కథలన్నీ కలిపి చదివితే అమెరికా జీవితాలు పూర్తిగా ప్రతిఫలిస్తాయా అని ప్రశ్నించుకుంటే, సమాధానం కాదని వెంటనే చెప్పేయచ్చు. ఆ సమాధానం లోనే కొత్త రచనలు చేయడానికి గొప్ప అవకాశాలు కనిపిస్తాయి. ఇప్పటి వరకు తీసుకో ని కథా వస్తువులు, అమెరికా కథకులకు పెక్కు కనబడాలి. సినిమా పరిభాషలో చెప్పాలంటే అమెరికా కథలు ఇంకా మొదటి తరం వలసదారుల కథలే. జంపా లాహిరి "నేమ్ సేక్ " చూసినట్లే. ఇక్కడ పుట్టి పెరిగిన కథలు మిండీ కళింగ "నెవెర్ హేవ్ ఐ ఎవర్ " లాంటి కథలింకా రాలేదు. రెండవ తరం వారు తెలుగు కథలు రాయ గలుగుతారు అన్న సందేహానికి, నేను ఇదివరకు ఓర్లాండో లో చెప్పిన మాటలే తిరిగి చెప్పాల్సి వస్తుంది.

భారత్ దేశం లోని అయిన వారి ని వదిలేసి కోయంబత్తూరు, మధుర, శ్రీలంకలలో ఎన్నో తరాలుగా బ్రతుకుతూ, ఇంకా బాగా మార్పులు కలిగిన తెలుగులో మాట్లాడు తున్న తెలుగు వారే మానకు నిదర్శనం. ఇంతకు మించి తెలుగు కథ ప్రపంచమంతా పచ్చగా బ్రతకడానికి టెక్నాలజీ సహాయ పడుతుంది అని నా గట్టి నమ్మకం. AI లాటి ప్రగతితో, రచయిత రచయిత్రి చెప్తుంటే, తెలుగులో కథ లిపిలోనే కాక, ఓ వీడియో గాను చిత్రీకరించి , పాఠకులకు, వీక్షకులకు అందజేసే సమయం అట్టే దూరం లేదని నా అంచన. భారత్ దేశంలో ఉన్నా, డయాస్పోరా తో బాటు వలస పోయినా, తెలుగు కథ చిరంజీవినే.

అమెరికా కథల భవిషత్తు కి కనీసం మరో ముప్పై ఏళ్ళు డోకా లేదు అని మంచి సంభావ్యత తో చెప్పవచ్చును. దానికి కారణం భారత దేశం నుంచి అమెరికాకి ఇంకా వలస వస్తున్న జనం. రేపొద్దున ఇమ్మిగ్రేషన్ ఆపేసిన, ఇంతవరకు వచ్చిన జనంలో ని రచయితలు, రచయిత్రులు సులభంగా, సంతోషంగా ఏంతో బాధ్యతతో కూడ కథలు రాయ గలరు. ఈ సందర్భంలో నాకు శ్రీయుతులు మధురాంతకం రాజారామ్, సింగమనేని నారాయణ గార్లు సంకలనం చేసిన "తెలుగు కథకులు , కథన రీతులు" గుర్తుకు వస్తున్నది. వారు ముందు మాట "ప్రస్తావన' లో తెలుగు కథానిక చరిత్ర రాస్తూ, 1910 "దిద్దుబాటు" రాసిన గురజాడ వారి నుంచి ఇప్పటి తరం కథకుల వరకు, వారి వారి రచనలు కూలంకుషంగా పలు తోటి రచయితలతో చదివించి, వారి మీద విశ్లేషణా వ్యాసాల రాయడం ఏంతో అవసరమని చెప్పారు. వారే ఓ రెండు సంపుటాల లో 50 మంది కథకులను ఎన్నుకొని వారి మీద వ్యాసాలు ప్రచురించారు. తెలుగు కథ పరిణామము తో చూస్తే అమెరికా కథ కూడా పరిణీతి చెందింది అంటే సంశయం లేదు. అదే చరిత్ర తో పోలిస్తే అమెరికా కథలు కూడా మరింత ఎత్తు ఎదిగే అవకాశం త్వరలోనే ఉంది అనిపిస్తున్నది. ఇది వరకు వచ్చిన విశ్లేషణాలన్నీ అమెరికా కథలు ఓ గంపలో వేసి బేరీజు చేసుకున్న ప్రయత్నాలు. అమెరికా కథ తనకంటూ ఓ స్థానం ని లదొక్కున్న ఈ రోజులలో, అమెరికా కథకులు వారి కథనా రీతులను కూడ తోటి కథకులు విశ్లేషించి రాయ వలసిన అవసరం కనబడుతుంది, వంగూరి వంటి సాహిత్య సేవ దృక్పథం కల సంస్థలు, ఇలాంటి ప్రయత్నం మీద నమ్మకం ఉన్న కథకులు ఇప్పటికే ఉన్నారు కాబట్టి, ఈ విశ్లేషణ అతి తొందరలోనే జరుగుతుంది అని నా నమ్మకము.

***

( మొట్టమొదటి కెనడా తెలుగు సాహితీ సదస్సు & 12వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు కోసం రాసినది - సెప్టెంబర్, 2021)